ప్రజాశక్తి

బుధవారం 10 ఏప్రిల్ 2024 | 8 పేజీలు



తిరుపతి

చిత్తూరు

సత్యవేడు నియోజకవర్గ

టీడీపీలో సంక్షోభం

కార్యకర్తలా.. కట్టు బానిసలా... అంటున్న అనుచరులు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: నియోజకవర్గంలోని మండల ప్రధాన నాయకుల సమన్వయలోపంతో బీటలు వారతున్న సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం అడ్డా. ప్రజల అభిష్టాన్ని, కార్యకర్తలు మనోభావాలను సైతం పక్కనపెట్టి స్వార్ధరాజకీయల కోసం అధిష్టానానికి తప్పుడు నివేదికలు ఇస్తూ తెరవెనుక వ్యవహారం నడిపిస్తున్నది ఎవరు..

సూళ్లూరుపేట కేంద్రంగా సత్యవేడు నియోజకవర్గం రాజకీయాలా.

దీనికి అవుననే సమాధానాలు బలంగానే వినిపిస్తున్నాయి. అనూహ్యంగా వైసీపీ ఎమ్మెల్యేని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత సత్యవేడు నియోజకవర్గం టీడీపీలో ఏర్పడ్డ సంక్షోభానికి తేరదించే ప్రయత్నాలను సత్యవేడు నియోజకవర్గానికి సంబంధంలేని వ్యక్తులు సూళ్లూరుపేట కేంద్రంగా మీటింగ్‌లు పెట్టడంపై నాయకులు, కార్యకర్తలు అగ్రహంతో ఉన్నారు. సత్యవేడులో ఆదిమూలం గెలిచినా.. ఓడినా.. రాష్ట్రంలో వచ్చేది టీడీపీ ప్రభుత్వమే కనుక టీడీపీ అభ్యర్థికి సహాయనిరాకరణ చేసి మీ పనులు చేసుకోలేక ఇబ్బంది పడవద్దు అంటూ ఎమోషనల్ బ్లాక్ చేస్తున్నట్లు సమాచారం..

2019లో టీడీపీ భారీ ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీ జెండాను మోసిన నాయకుడితో కొంతమంది నియోజకవర్గ నాయకులకు అంతర్గత విబేధాల కారణంగా లాబీయింగ్ చేసి మరీ మాజీ ఎమ్మెల్యేని నియోజకవర్గ ఇంచార్జిగా నియమింపజేసి యువగళం పాదయాత్ర నుండి మొన్నటి సీబీన్ మీటింగ్ వరకు ఆర్థికంగా బాగానే ఖర్చు పెట్టించారు. ఒక్కప్పుడు వైసీపీ ఎమ్మెల్యేగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఉక్కుపాదం

2 లో

టిటిడి జేఈవోగా బాధ్యతలు చేపట్టిన గౌతమి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి జేఈవోగా (విద్య,వైద్యం) ఎం.గౌతమి మంగళవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో పలు ఐఏఎస్‌లు బదిలీ అయిన విషయం తెలిసిందే. 2014 బ్యాచ్‌కి చెందిన ఎం.గౌతమికి టిటిడి తిరుపతి జేఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. మంగళవారం ఇన్చార్జి జేఈవో వీరబ్రహ్మం నుంచి బాధ్యతలు స్వీకరించారు. గతంలో జేఈఓగా పనిచేసిన సదాభార్గవి స్థానంలో గౌతమి వచ్చారు. ఎండోమెంట్ రెవెన్యూ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న గౌతమిని తిరుపతికి పోస్టింగ్ ఇచ్చారు.

శ్రీవారి ఆలయంలో

వేడుకగా ఉగాది ఆస్థానం



ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. ఈకార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేశారు. శ్రీవారి ఉత్సవర్ల పక్కనే మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షులు శ్రీవిశ్వక్సేనుల వారిని వేంచేపు చేశారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేశారు.

అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఆలయం వెలుపల ఈవో మీడియాతో మాట్లాడుతూ, భక్తులందరికీ నూతన తెలుగు శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచం, దేశం, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో డిఎల్‌ఓ వీర్రాజు, ఎస్‌ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులను విశేషంగా ఆకట్టుకున్న ఫల - పుష్ప అలంకరణలు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల,పుష్ప అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందుకోసం 10 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 60వేల కట్‌ఫ్లవర్స్ ఉపయోగించారు. శ్రీవారి ఆలయం లోపల ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, నారింజ, కర్బూజ, మామిడి, చెరకు వంటి విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో భూలోక వైకుంఠంగా శ్రీవారి ఆలయాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. శ్రీవారి ఆలయంలో ధ్వజస్థంభం చెంత పుచ్చకాయలతో చెక్కిన దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా అయోధ్య రామాలయం, బాల రాముడి సెట్టింగ్, నవధాన్యాలతో రూపొందించిన మత్స అవతారము భక్తులను మైమరిపించింది. ఆలయం వెలుపల గొల్ల మండపం పక్కన త్రేతా, ద్వాపర, కలియుగాలకు సంబంధించిన

2 లో

మండే ఎండలో కూలి పనులు

కుటుంబ జీవనం కోసం తప్పదంటున్న కూలీలు

ప్రజాశక్తి- సోమల: మండలంలో వేసవి కాలం ప్రారంభం నాటి నుంచి సూర్యుడు నిప్పుల కొలిమిలా మారి తన ప్రతాపాన్ని చూపిస్తూ వస్తున్నాడు. మండలంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయం పైన ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయానికి కూలీల సహకారంతో పంటలు సాగు చేస్తూ రైతులు కూలీలకు ఉపాధి కల్పిస్తూ వస్తున్నారు. అయితే నిప్పుల కొలిమిలా మారిన ఎండలు కూలిలకు పంట పొలాలలో శ్రమించేందుకు

మండుటెండలో పొలంలో పేపర్ పరుస్తున్న కూలీలు

తీవ్రఇబ్బందిగా మారుతుంది. టమోటా, వరి, బొప్పాయి ఇతర పంటలు సాగు చేసే రైతులు కూలీల ద్వారా పనులు చేయించుకుంటూ పంటలు పండిస్తున్నారు. టమోటా పంటలు పేపరు పరచడం మొక్కలు నాటడం పంట కాస్త ఎదిగిన తర్వాత మొక్కకు సపోర్టుగా కట్టెలు నాటడం చేస్తూ వస్తుంటారు. ఇదంతా మండుటెండలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం

2 లో

32 మందితో

బీసీవైపీ తొలి జాబితా..

పుంగనూరు సహా మంగళగిరి నుంచి పార్టీ అధినేత పోటీ

రాజధాని పరిరక్షణ ధ్యేయంగా మంగళగిరి ఎంపిక

ప్రజాశక్తి- పుంగనూరు

రాష్ట్రంలో రాజకీయ మార్పు, సామాన్యుడి చేతిలో పాలన, పేదప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ఏర్పడిన భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ తొలి జాబితా విడుదల అయ్యింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆపార్టీ తరపున 32 మంది అభ్యర్థులతో మొదటి విడత జాబితాను పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ మంగళవారం ప్రకటించారు. రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్పు చేసే దిశగా, అసలైన సామాజిక న్యాయం అమలు చేసే దిశగా, రాష్ట్రంలోని అన్నివర్గాలకు సమన్యాయం అందించే దిశగా అడుగులు పడ్డాయి.

పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ రెండు స్థానాల నుండి పోటీ చేయనున్నారు. తన సొంత నియోజకవర్గమైన పుంగనూరుతో సహా, మంగళగిరి నుండి కూడా పోటీకి దిగనున్నారు. రాష్ట్ర రాజధాని రక్షణ, అక్కడ రైతులకు అండగా నిలిచేందుకు అధినేత ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ ప్రత్యేకంగా కసరత్తు చేశారు. మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జిల్లా, నియోజకవర్గ నేతలతో సమీక్షలు జరిపారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు ఇప్పటికే నియోజకవర్గాల్లో నేతలు విస్తతంగా ప్రచారం నిర్వహిస్తూ పార్టీ ఎన్నికల గుర్తు చెరకు రైతును ప్రజల్లోకి తీసుకువెళ్లారు. బీసీ యువజన పార్టీ నేతల ప్రచారానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పుడు అధికారికంగా

2 లో

(మొదటి పేజీ తరువాయి)

శ్రీవారి ఆలయంలో

వేడుకగా ఉగాది ఆస్థానం

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీ వేదనారాయణ స్వామి, శ్రీమహావిష్ణువు దశావతారాలు, ఉద్యానవనంలో ఆడుకుంటున్న రామలక్ష్మణుల సమేత హనుమంతుల వారు, బాలకృష్ణుడు వంటి పౌరాణిక ఘట్టాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయం బయట భక్తులు తమ చరవాణుల్లో ఫలపుష్ప ఆకృతులతో ఫోటోలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు. టీటీడీ గార్డెన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది 100 మంది రెండు రోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన ఫల, పుష్ప ఆకృతులను రూపొందించారు.

మండే ఎండలో కూలి పనులు

ఐదు గంటల వరకు జరుగుతూ ఉండగా కూలీలు ఆ సమయంలో ఎండలో తమ కూలి కోసం శ్రమిస్తూ ఉంటారు. దీంతో మండే ఎండలు కూలీలకు శ్రమించేందుకు ఇబ్బందిగా మారుతున్నాయి. దీంతో పలువురు కూలీలు ఉదయం 6 నుండి 10 గంటల వరకు మధ్యాహ్నం మూడు గంటల నుండి 6 గంటల వరకు కూలి పనులు చేస్తూ ఎండ బారిన పడకుండా జాగ్రత్త వహిస్తున్నారు. మరికొందరు కూలీలు అయితే తలపాగా చుట్టుకోవడం టోపీలు పెట్టుకోవడం చేస్తూ ఎండ నుండి రక్షణ పొందుతున్నారు. రైతులు కూడా కూలీల ఇబ్బందులు గుర్తించి వారికి చల్లటి మజ్జిగ చల్లటి పానీయాలను అందిస్తూ వస్తున్నారు. ఏది ఏమైనా కూటికోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు అలా ఎండైనా నిప్పుల కొలిమైన కూలీలకు జీవనం కోసం కూలి పనులు చేయక తప్పని పరిస్థితికి ఏర్పడుతోంది.

సత్యవేడు నియోజకవర్గ

టీడీపీలో సంక్షోభం

మోపిన అదే ఎమ్మెల్యేకే టీడీపీ టికెట్ ఇవ్వడంపై ప్రధాన నాయకులు సైతం మిన్నుకుండటంపై కార్యకర్తలు అసంతప్తి గా ఉన్నారు. సత్యవేడులో టీడీపీ గెలిస్తే కష్టపడి గెలిపించుకున్నామని, ఒక వేళ ఓడిపోతే అధిష్టానం మమ్మల్ని సంప్రదించకుండా తీసుకున్న నిర్ణయం వల్లనే ఓడిపోయామని తెలివిగా తప్పించుకోవడానికి ప్రధాన నాయకులు సిద్ధంగా ఉన్నారు. ఎటు తిరిగి మేమే నష్టపోవాల్సి వస్తుందని టీడీపీ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఇక అభ్యర్థిని మారుస్తున్నారంటూ అటు సోషల్ మీడియా ఇటు యూట్యూబ్ ఛానెల్స్‌లో వార్తలు హల్‌చల్ అవుతుంటే... అలా ఏమి లేదంటూ ఎమ్మెల్యే అభ్యర్థి తనకు అనుకూలవర్గంతో వేగంగా నియోజకవర్గంలో మీటింగ్‌లు పెడుతుండటంతో ప్రజలలో క్యాడర్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ప్రజల చూపుని రెబల్ వైపు తిప్పుకునే విధంగా రెబల్ అభ్యర్థి జెడి రాజశేఖర్ కుటుంబంతో సహా ప్రజలలో తిరుగుతున్నారు. టీడీపీ కష్టకాలంలో ఉన్నపుడు పార్టీ జెండాను ప్రజలలోకి తీసుకుని వెళ్లి తాను పడ్డ కష్టాన్ని అధిష్టానం గుర్తించకుండా కనీసం సంప్రదింపులు కూడా లేకుండ పార్టీ తనకు చేసిన అన్యాయంపై ప్రజలకు తెలియజేస్తూ టీడీపీ రెబల్ అభ్యర్థిగా తనను ఆదరించాలని టీడీపీ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపే పనిలో ఆయన ప్రజలలోకి దూసుకుని వెళ్తున్నారు.. ఇప్పటికైనా దిగువ స్థాయి కార్యకర్తల అభిప్రాయం మేరకు టీడీపీ అధిష్టానం (సీబీన్) సత్యవేడులో ఏర్పడ్డ సంక్షోభాన్ని తెరదించి అందరిని సమన్వయపరిచి సత్యవేడు కోటలో తిరిగి తెలుగుదేశం జెండాను ఎగరవేయాలాని టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు కోరుకుంటున్నారు.

'మార్పు కావాలి'లో బాలగురువం బాబు

ప్రజాశక్తి- నారాయణవనం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు పాతర వేసి వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించారని సత్యవేడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలగురువం బాబు ఆరోపించారు. మంగళవారం ఆయన నారాయణవనం మండలంలో పలు గ్రామాలలో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాలుగా విధ్వంసకర పాలన కొనసాగుతుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల సామాన్య ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

గడచిన పది సంవత్సరాల నుండి నిరుద్యోగ సమస్య వెంటాడుతుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మోహన్, ప్రసాద్, బాబు, అల్లిముతు, దేశయ్యా, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉగాది కవి సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: క్రోధినామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కైకాలవారి కళ్యాణ మండపంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చేసిన కవులు వారి స్వీయ కవితలు వినిపించారు. ఉగాది ఉషస్సులు విరబూయాలని, సమసమాజ స్థాపనకు నడుంబిగించాలని కవితలు వినిపించారు. అనంతరం లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారాలను వారి కుమార్తెలు కిరణ్మయి, కృష్ణశశిలు శతావధాని ఆముదాల మురళికి, రచయిత చెంచుకష్ణ పిళ్ళైకి ఇద్దరికి ఐదువేల నగదుతో పాటు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం కవితలు చదివిన కవులందరికి జ్ఞాపకలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గొడుగుచింత గోవిందయ్య, వేదిక ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి కార్యవర్గ సభ్యులు జయచంద్ర రావు, తీగల వెంకటయ్య, గురునాథం, గణేష్ ,రవీంద్ర, బాలముని శివకుమార్, ముని సుబ్బారెడ్డి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది ఆస్థాన వేడుకలు

పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి- రామచంద్రపురం

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటలకు సుప్రభాతం నిర్వహించాక శుద్ధి నిర్వహించారు. ఆతర్వాత ఉదయం 6గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు తీసుకుని ఆలయం ధ్వజస్తంభం చుట్టూ

తిరిగి ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి పంచాగ శ్రవణం చేశారు. ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు ఉద్యోగుల భవిష్య నిధి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ప్రాంతీయ ఉద్యోగ భవిష్య నిధి ఆర్గనైజేషన్, కడప వారు వెబ్‌ఎక్స్ ప్లాట్ఫారం ద్వారా 10వ తేదీ ఏప్రిల్ ఉదయం 11 గంటలకు పెన్షన్ అదాలత్ జరుపుతున్నారని, ఎవరైనా పెన్షనర్లు మరియు రానున్న మూడు నెలల్లో రిటైర్ అయ్యేవారు తమ సమస్యలు తెలుపుకోవాలంటే నేరుగా కింద తెలుపబడిన లింక్ ద్వారా కనెక్ట్ అవ్వాలని తిరుపతి జిల్లా అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భవిష్య నిధి పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

స్థానిక ప్రసూతి హాస్పిటల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షులు మక్కిన భాస్కర్ ఆధ్వర్యంలో ఉగాది పండుగ పర్వదిన సందర్భంగా ఆసుపత్రిలోని తల్లులు వారి కుటుంబ సభ్యులకు 300మందికి అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మక్కిన భాస్కర్ మాట్లాడుతూ రుచికరమైన అల్పాహారం కోసం ఆసుపత్రిలోని తల్లులు వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది బయటకొని తినే పరిస్థితి లేదని వారికి లయన్స్ క్లబ్ సభ్యులు, ఇతర దాతల సహాయ సహకారాలతో ఈకార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. సభ్యులు వి.మిథున్ కుమార్‌రెడ్డి కూతురు వారణాసి ఐరారెడ్డి పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ద్వారా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి జి.శంకరయ్య, కోశాధికారి సి.చక్రపాణి, అధ్యక్షులు సోమయ్య, కోశాధికారి వామాద్రి నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

వైసిపిలోకి భారీగా చేరికలు

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. స్థానిక 8వ డివిజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు యామాతి ప్రభాకర్ రెడ్డి ఆ పార్టీని వీడి, తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్పోరేటర్ తిరుపతి మునిరామి రెడ్డి ఆధ్వర్యంలో భూమన కరుణాకర రెడ్డి వారికి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఇదే డివిజన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు నచ్చు చంద్రాయాదవ్ ఆ పార్టీకి గుడ్ బై కొట్టి, వైఎస్సార్ సీపీలో చేరారు. తిరుపతి మునిరామిరెడ్డి, బెల్లం రమేష్ ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి వైసిపిలో చేరగా, వారికి భూమన కరుణాకర రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

32 మందితో

(మొదటి పేజీ తరువాయి)

బీసీవైపీ తొలి జాబిత..

అభ్యర్థుల లిస్ట్ ను ప్రకటించినప్పటికీ ముందుగానే ఆయా నియోజకవర్గాల్లో బీసీ యువజన పార్టీ నేతలు గ్రౌండ్ వర్క్ ప్రెపేర్ చేసుకున్నారు. అధినేత నుండి అధికారికంగా అభ్యర్థుల ప్రకటన జరగడంతో ఎన్నికల కదనరంగంలో తమ సత్తా చాటేందుకు నేతలు సిద్ధం అవుతున్నారు.

ఎన్ని ప్రత్యేకతలో..!

ఈతొలి జాబితాలో కొన్ని అనూహ్య పరిణామాలు, ప్రత్యేకతలు ఉన్నాయి. ట్రాన్స్‌జెండర్‌కు తొలిసారి ప్రాధాన్యత దక్కింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకూ ఏ రాజకీయ పార్టీ కూడా ట్రాన్స్ జెండర్లను పట్టించుకోలేదు. తొలిసారిగా బీసీ యువజన పార్టీ అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలో మరే ఇతర పార్టీలు ఇంత వరకూ చేయని సాహసాన్ని, సమన్యాయాన్ని బీసీవై పార్టీ అమలు చేసింది. సమాజసేవలో పేరొంది, ప్రజాసేవ పట్ల మక్కువ ఉన్న ట్రాన్స్ జెండర్లకు చట్టసభల్లో అవకాశం ఇవ్వాలనే ఆలోచనతో తమన్నా సింహాద్రిని పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థిగా బీసీవై పార్టీ ప్రకటించింది. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇక్కడ ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రిని పోటీ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై బీసీవై పార్టీ తరపున ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి పోటీ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థులు వీరే..!

ఇచ్ఛాపురం- బడ్డి మురళి, శ్రీకాకుళం- పనిల ప్రసాద్, ఆముదాలవలస - సెపిన శ్రీనివాసరావు, అరకు వ్యాలీ (ఎస్టీ)- దుర్లయ సాయిబాబ, పాడేరు- కైలో రంగారావు, ప్రత్తిపాడు - కుందల సాయికుమార్, పిఠాపురం- తమ్మన్నా సింహద్రి, రామచంద్రాపురం - బొర్ల వెంకట శ్రీనివాసరావు, రాజమండ్రి రూరల్- దుగ్గిరాల శ్రీదేవి, నరసాపురం- ఆకుల వెంకట స్వామి, మైలవరం- ముప్పసాని భూలక్ష్మి, పెదకూరపాడు- ఆళ్ల రామకష్ణారావు (ఆర్కే యాదవ్), మంగళగిరి -బొడె రామచంద్ర యాదవ్, రేపల్లె - అంకిరేకుల ఆదినారాయణ, తెనాలి - తుమపాల నరేంద్ర, ప్రత్తిపాడు (ఎస్సీ) -ఎస్ఎస్ రాణి (మహాలక్ష్మి), నరసరావుపేట- గోగుల మనోహర్ యాదవ్, మార్కాపురం -భాగ్యలక్ష్మి రావిళ్ల, నెల్లూరుసిటీ- కాళహస్తి చెంచు మహేష్, కొవ్వూర్ (ఎస్సీ) - పుటిక సుబ్బరాయుడు, పులివెందుల- సురే నిర్మల, నంద్యాల - చింతపల్లె సుధాకర్ రావు, ఢోన్ - తరిగోపుల బాల సుబ్బయ్య (బాలు యాదవ్), పత్తికొండ- మిద్దె వెంకటేశ్వర్లు అలూర్ - ఎన్ మోహన్ ప్రసాద్, గుంతకల్- ముచల శశిభూషన్ రెడ్డి, పుట్టపర్తి - బాల రామాంజనేయులు, పుంగనూరు- బొడె రామచంద్ర యాదవ్, తిరుపతి - ఎ.కష్ణవేణి యాదవ్, శ్రీకాళహస్తి- కే ధినాద్ బాబు, పూతలపట్టు (ఎస్సీ)- నాంపల్లి భానుప్రసాద్, రాప్తాడు - గంగాటి మంజునాథ్ రెడ్డి.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): బావిలో ఈత కొట్టడానికి వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చంద్రగిరిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు..చంద్రగిరి పాతపేట బజారు వీధి శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో సుభాషిణి, ఆమె కుమారుడు జయంత్ శర్మ (24) నివాసం ఉంటున్నారు. సుభాషిణి భర్త ఫిబ్రవరి 24వ తేదీ అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం చంద్రగిరి పట్టణానికి చెందిన ఐదుగురు స్నేహితులు జయంత్ శర్మను ' 'ఈతకు వెళదాం రా..' అని పిలిచారు. జయంత్ శర్మ తన వాహనంలో చంద్రగిరి మండలం ద్వార్నగంబాల పంచాయతీ మొండి కాల్వ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత రాని జయంతి శర్మ బావిలో దూకడంతో మునిగిపోయాడు. అనంతరం అతని స్నేహితులు బావిలో గాలించి అతడిని బయటికి తీసి చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జయంతి శర్మ మృతి చెందాడు. దీంతో చంద్రగిరిలో విషాదఛాయలు నెలకొన్నాయి. సంపాదపరుడైన కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు బోరును వినిపిస్తున్నారు. జయంతి శర్మ మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్ వి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామయ్య తెలిపారు.

చంద్రగిరిలో విషాద ఛాయలు

ఈతకు వెళ్లి మృతి చెందిన యువకుడు జయంత్ శర్మ

తుంపర సేద్యం..మెట్ట రైతుకు లాభం..

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయ చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళు తున్నారు.సూక్ష్మ, తుంపర సేద్యంతో సాగునీరు, శ్రమ ఆదా డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం పై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడ లను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయ చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే అవకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్క జొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవ సాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొ చ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందిస్తోంది.

తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు

తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600ల వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలను నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి.

స్ప్రింక్లర్ల అమరికలో మూడు విధానాలు

స్ప్రింక్లర్లను మూడు విధాలుగా పంట పొలాల్లో అమర్చుకునే అవకాశం ఉంది. శాశ్వతంగా పైపులను భూమిలో పాతిపెట్టి స్ప్రింక్లర్ హెడ్‌లను అమర్చి నీటిని విరజిమ్మడం మొదటి విధానం అయితే కొన్ని పైపులను మాత్రం భూమి లోపల ఉంచి మిగతా పరికరాలను బయట ఉంచి మొక్కలన్నింటికీ తుంపర్లు పడేలా అమర్చు కోవడం రెండో విధానం. ఇక స్ప్రింక్లర్ పైపులన్నీ భూమిపైనే ఉంచి పంటకు నీరందించడం మూడో విధానంగా చెప్పొచ్చు. ఈ విధానం ద్వారా పైపులను ఒకచోట నుంచి మరో చోటికి తరలించి వీలైనన్నీ పంటలకు తుంపరసేద్యం ద్వారా నీరందించేందుకు వీలవుతుంది. స్ప్రింక్లర్‌లో ముఖ్యమైంది స్ప్రింక్లర్ హెడ్. ఇందులో రెండు రంధ్రాలు ఉంటాయి. ఒకటి 4 నుంచి 5.6మిల్లీ మీటర్ల సైజు ఉండగా ఇంకోటి 3.13 మిల్లీమీటర్ల సైజు ఉంటుంది. ఎక్కువ పీడనం గల స్ప్రింక్లర్ సుమారు 35 మీటర్ల వ్యాసం కలిగిన భూమిని తడుపుతుంది. తక్కువ పీడనం గల స్ప్రింక్లర్ 30మీటర్ల వ్యాసం గల భూమిని మాత్రమే తడుపుతుంది.

బిందు, తుంపర సేద్యం వల్ల కలిగే లాభాలు..

సులభ పద్ధతుల్లో దిగుబడులు పెంపు

రైతులు తక్కువ శ్రమ, తక్కువ సాగునీటి వినియోగం లాంటి సులభ పద్ధతుల్లో పంటలు సాగు చేసి దిగుబడులు పెంచుకోవాలి. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా పంటకు సరిపడా నీటిని అందించడంతో పాటు శ్రమ, సమయం కలిసొస్తుంది. పంటకు స్ప్రింక్లర్లను అమర్చి కొంత సమయాన్ని ఇతర పనులకు కేటాయించుకునే అవకాశం ఉంది. తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్న డ్రిప్, స్పింక్లర్లను ఆరుతడి పంటల సాగు కోసం రైతులు ఏర్పాటు చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నా రైతు సాగు చేసిన పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం వల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా సాధారణం కంటే 5 నుంచి 20 శాతం వరకు అదనంగా వస్తాయి..స్ప్రింక్లర్ పద్ధతి ద్వారా భూమి లోపలి పొర ల్లోకి నీరు వెళ్లకుండా మొక్కల వేళ్ల వరకే వెళ్లి మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది. ముఖ్యం గా ఇసుక నేలల్లో ఈ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగ పడుతుంది. మొక్కలకు అవసరమైన నీటిని ఎక్కువ సార్లు తక్కువ మోతాదులో ఇవ్వొచ్చు.

ఉష్ణోగ్రతల నుంచి పంటలకు రక్షణ

స్ప్రింక్లర్ల నుంచి వెలువడే మృదువైన నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరు నిల్వ ఉండదు, మట్టి గడ్డ కట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంట దిగుబడి కూడా పెరుగుతుంది. తుంపర సేద్యం ద్వారా ఎగుడు, దిగుడుగా ఉన్న నేలల్లోనూ పంటలు పండించొచ్చు.స్ప్రింక్లర్ ద్వారా నీరు వర్షంలా పడటంతో పంట చుట్టుపక్కల వాతావరణం చల్లగా మారి అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటను కాపాడుకోవచ్చు.డ్రిప్ సిస్టం ద్వారా పలు రకాల పండ్లతోటలను విరివిగా పెంచుకునే అవకాశం ఉంది.బిందు సేద్యం(డ్రిప్) వల్ల 30 నుంచి 40 శాతం కరెంట్, 30 నుంచి 40 శాతం ఎరువులు ఆదా అవుతాయి.ఎత్తు పల్లాలు ఉన్న భూముల్లోనూ అన్ని మొక్కలకు ఒకే మోతాదులో నీరు అందడం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది.బిందుసేద్యంతో భూమి కోతకు గురికాకుండా, [illegible] కోల్పోకుండా, పంటకు చీడపీడలు రాకుండా ఉంటుంది.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: PUTTUR
0.S.No.31/2022

Between:
P. Varada Pillai and others ...Plaintiffs
And:
R. Subramanyam Pillai and others ...Defendants

SUMMONS TO THE DEFENDANTS

To
D1. R.Subramanyam Pillai S/o late Munaswamy Pillai D2. R.Krishna, S/o P.Subramanyam Pillai, D3. R.Saravana S/o R.Subramanyam Pillai, D1 to D3 are residing at, Kama Raj Nagar, Puttur town and Mandal, Tirupati Dist.,

Please take summons that the plaintiffs have filed above suit against you before the Hon'ble Senior Civil Judges court puttur and the same posted to 29.04.2024 for your appearance. Hence your directed to appear before the afore said court on 29-04-2024 at about 10.30 A.M. and file your objections if any through advocate or in person otherwise the matter will be decided exparte.

by order
SG PAYANI, BA., BL.,
Advocate for the Plaintiffs. Puttur

In the Court of the VIIth Addl. District Judge. Gudur
I.A.No. 55 / 2019
O.S.No. 209 / 2014

1. Konduru Sobha
and others ... Petitioners / Plaintiffs
Vs
1. Kotta Girija
and others ...Respondents/ Defendants

Notice to 5th Respondent
Munjuluru Jalajavani,
D/o. Late **Narasimhulu,**
Gamallapalem, Gudur,
SPSR Nellore District.

పై నెంబరు కేసులో పిటిషనర్లు/ వాదులు మీ మీద పై వారి కోర్టులో I.A.No. 55 / 2019 పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే22-4-2024దిన** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వేళ్ళఉపేంద్రరావు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్లు / వాదులు తరపు న్యాయవాది
నెల్లూరు.

In the Court of the VIIth Addl. District Judge. Gudur
I.A.No. 54 / 2019
O.S.No. 209 / 2014

1. Konduru Sobha
and others ... Petitioners / Plaintiffs
Vs
1. Kotta Girija
and others ...Respondents/ Defendants

Notice to 5th Respondent
Munjuluru Jalajavani,
D/o. Late **Narasimhulu,**
Gamallapalem, Gudur,
SPSR Nellore District.

పై నెంబరు కేసులో పిటిషనర్లు/ వాదులు మీ మీద పై వారి కోర్టులో I.A.No. 54 / 2019 పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే22-4-2024దిన** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వేళ్ళఉపేంద్రరావు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్లు / వాదులు తరపు న్యాయవాది
నెల్లూరు.

క్రైం న్యూస్

కర్ణాటక మద్యం పట్టివేత

ద్విచక్ర వాహనం స్వాధీనం, వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: పలమనేరు –కుప్పం జాతీయ రహదారిలోని కైగల్ బ్రిడ్జి వద్ద అక్రమంగా తరలిస్తున్న 35 వేల రూపాయల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని, ఒక ద్విచక్ర వాహనంతో పాటూ వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో మంగళవారం కైగల్ బ్రిడ్జి హైవేలో వాహనాలు తనిఖీ చేపట్టారు. బైరెడ్డిపల్లి మండలంలోని కుటవలవంక గ్రామానికి చెందిన నటరాజ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 864 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు పట్టు బడ్డాయి. వాటి విలువ సుమారు 35 వేల రూపాలు ఉంటుందని తెలిపారు. నిందితు డిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం దిగువ ముద్ది కుప్పం పరిధిలో పేకాట స్థావరాలపై పోలీసుల మంగళవారం దాడులు నిర్వహించారు. ఇద్దరిని అరెస్టు చేశారు. నలుగురు పరారీలో వున్నారు. వారి నుండి నాలుగు ద్విచక్ర వాహనాలు, పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

సారా విక్రయదారుల అరెస్ట్

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: సారా విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ పేర్కొన్నారు. బంగారు పాళ్యం మండలంలోని రామరాజు పురం గ్రామానికి చెందిన ముని స్వామిరాజు, శంకర్ రాజు ఒక ప్లాస్టిక్ క్యాన్‌లో ఐదు లీటర్ల నాటు సారా కలిగి ఉండగా వారిని అదుపులో తీసుకొని విచారించామని, గ్రామీణ ప్రాంతంలో సారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని అంగీకరించారని దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించి జైలుకు పంపామని తెలిపారు. ఈ దాడుల్లో చిత్తూరు రూరల్ సెబ్ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది అలెగ్జాండర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ వుందని, ఎలాంటి మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఫోను నెంబరు 9492814414 కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అరెస్టు అయిన సారా విక్రయ దారులు

వైసిపి నుండి టిడిపిలో చేరిక

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట ఎస్‌విపురం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు వెంకట సుబ్బయ్య యాదవ్ మంగళ వారం తన అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. టిడిపి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ టిడిపి కండువా కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. వీరు గతంలో టీడీపీ లో మండల ప్రధాన కార్యదర్శి, బీసీ సెల్ ప్రసిడెంట్ గా పని చేశారు. మునికృష్ణ, తులసి రామ్, చెంగయ్యలు ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా టిడిపి విజయానికి కృషి చేస్తే అధినేత చంద్రబాబు నాయుడు మంచి భవిష్యత్తును అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్‌విపురం సర్పంచి జి సుబ్రహ్మణ్యం యాదవ్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి ఛైర్మన్ ఇంటింట ప్రచారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మంగళవారం సాయంత్రం స్థానిక 8,9 వ డివిజన్ల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం వెంట రాగా, వైసిపి కార్పొరేటర్ తిరుపతి మునిరామి రెడ్డి ఆధ్వర్యంలో 8 వ డివిజన్ లో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ లీలావతి ఆధ్వర్యంలో 9 వ డివిజన్ లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి ఇంటింటికీ కర పత్రాలు పంచి తిరుపతి ఎమ్మెల్యేగా భూమన అభినయ్ ని, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమికి పొరబాటుగా ఓట్లు వేస్తే సంక్షేమ పథకాల రద్దుకు ఆమోదముద్ర వేసినట్టే అవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే సంక్షేమ పథకాలు రెట్టింపుగా అమలు అవుతాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌కు మద్యం ఆదాయ వనరు

- తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్నా సీఎం జగన్ మద్య నిషేధం చేయకుండా మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2019 ఉగాది రోజున ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి మద్యపాన నిషేధం చేస్తానని వాగ్దానం ఇచ్చి నేడు అధికారం పూర్తయ్యే వరకు రాష్ట్రంలో నాసిరకం మద్యాన్ని సరఫరా చేసి వేల మంది ప్రాణాలు కోల్పోవడానికి సీఎం జగన్ కారణమయ్యాడని ఆరోపించారు. 'మాట తప్పను మడమ తిప్పను..' అంటూనే ఇచ్చిన వాగ్దానాలు అన్నింటిని ఆదాయమే పరమావధిగా పాలన కొనసాగించారని జగన్ తీరును ఎండ గట్టారు. వైన్ షాపులనూ ఎలక్షన్ కమిషన్ తన పరిధిలోకి తీసుకొని, నిఘా ఉంచాలని కోరారు.

మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు

'ప్రస్తుతం ప్రచారాల్లో పాల్గొన్న వారికి టోకెన్లు ఇచ్చి ఫలానా షాపు వద్దకు వెళ్లి టోకెన్ ఇస్తే మందు ఇస్తారని చెబుతున్నారని, ఇది ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధం కాదా?' అని ప్రశ్నించారు. వైసిపి హయాంలో జరిగిన మద్యం అమ్మకాలపై ఎలక్షన్ కమిషన్ పూర్తి విచారణ చేపట్టాలని కోరారు. మద్య నిషేధంపై జగన్ యాత్రలో మహిళలు నిలదీయాలని కోరారు. ఈ సమావేశంలో కరణం సందీప్, కృష్ణ యాదవ్, శీను, ఆర్పి శ్రీనివాసులు, షఫీ, శ్రీరామ్, గణేష్, లోకేష్ పాల్గొన్నారు.

టిడిపి గెలుపుతోనే అభివృద్ధి

-పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం రామకృష్ణాపురం గ్రామపంచాయతీ గొల్లపల్లి హరిజనవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ య్య మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. వైసీపీ పాలనతో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ గాడిన పడాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ల వైసీపీ పాలనతో అభివృద్ధి ఆమడదూరంలో నిలించిందని.. నగరి నియోజక వర్గంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, ఇక్కడ వారికి ఉపాధి కల్పించే అమరరాజ వంటి సంస్థలు కూడా పక్క రాష్ట్రాలకు తరలిపోయాయని పేర్కొన్నారు. టిడిపి పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని ప్రతి ఒక్కరికీ వివరించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నగరి శాసన సభ్యులుగా గాలి

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు గంజి మాధవయ్య

భానుప్రకాష్‌ని, ఎంపీ అభ్యర్థిగా దగ్గమళ్ల ప్రసాద్ రావు విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పుత్తూరు రూరల్ అధ్యక్షుడు డి రవికుమార్, మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎ బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, బూత్ ఇన్‌ఛార్జ భాస్కర్ రెడ్డి, టిడిపి నాయకులు చిన్నబ్బ, ముని కృష్ణయ్య, ముని రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి దళితవాడకు చెందిన పలువురు టిడిపిలో చేరారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి కూటమి అభ్యర్థి నెలవల విజయశ్రీ

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని నెమలిమిట్ట అగ్రహారం, అక్కర పాక, కృష్ణాపురం, పోలిరెడ్డిపాలెం, గొల్లపాలెం, ముత్తరాశి పాలెం, కల్లూరు, కల్లూరు కండ్రిగ, గ్రామాల్లో సూళ్లూరు పేట నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి నెలవల విజయశ్రీ మంగళవారం ప్రచారం నిర్వహించారు. తమను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, సూళ్లూరు పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, మండల అధ్యక్షులు చిరంజీవి పాల్గొన్నారు. టిడిపి మండల కన్వీనర్ వేమసాని శ్రీనివాస్ నాయుడు, మాజీ ఎంపీపీ ఇట్టికుంట రత్నయ్య పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు ముఖ్యం

తిరుపతి సిటీ: యువత రానున్న ఎన్నికల్లో మార్పు కోసం జనసేనకు ఓటేసి గెలిపించాలని టిడిపి, బిజేపీ బలపరుస్తున్న కూటమి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం స్థానిక తారకరామా స్టేడియం లో వాకింగ్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. వాకర్స్ తో పాటు సీనియర్ అథ్లెట్ లు , సమ్మర్ కోచింగ్ కు వచ్చిన విద్యార్థులకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులు, యువత కోసం క్రీడా మైదానాలను మెరుగుపరుస్తామని ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, యినుకొండ సుబ్రమణ్యం, సింగంశెట్టి సుబ్బరామయ్య , 23వ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రేమ్ కుమార్, కోటేశ్వర రావు22వ డివిజన్ అధ్యక్షులు బాల పాల్గొన్నారు.

వంచనతో నలుగుతున్న అణగారిన వర్గాలు

- ప్రజల్లో తిరుగుబాటుతోనే అంతరాలు కనుమరుగు
- మాజీ ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి విజయ్ కుమార్‌తో 'ప్రజాశక్తి' ముఖాముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దశాబ్దాల కాలంగా అణగారిన వర్గాల ప్రజలు వంచనకు గురి అవుతూనే వున్నారు. పెత్తందారి పోకడలు తమ అధికార స్వలాభం కోసం అణగారిన వర్గాలను ఓటర్లుగానే పరిగణిస్తూ వారి అభివృద్ధిని కాంక్షించలేని పరిస్థితుల్లో నేడు రాజకీయ పార్టీలు అధికారం కోసం ఉచిత వాగ్దానాలు చేసి మోసం చేస్తూనే ఉన్నాయి. ఒకవైపు కుల మతాల మధ్య చిచ్చులు పెడుతూనే మరోవైపు ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టే పరిస్థితులు సర్వసాధారణమైపోయాయి. దశాబ్దాల కాలంగా మారిన రాజకీయ పార్టీల వ్యవహార శైలిపై మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ తో 'ప్రజాశక్తి' ముఖాముఖి నిర్వహించింది.

ప్రజాశక్తి: మీ సర్వీసు ప్రారంభంలో రాజకీయ పార్టీల వ్యవహార శైలి ఏ విధంగా ఉంది?

అధికారి: మూడు దశాబ్దాల క్రితం రాజకీయం అనేది కొంతైనా విలువలతో నడిచేది. ఆనాడు ప్రభుత్వ విధానాలపై, పాలసీలపై, ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలిపై నిర్మాణాత్మక విమర్శలు ఉండేవి. ఏనాడూ వ్యక్తిగతంగా వెళ్లేవారు కాదు. నేడు ఆ పరిస్థితులకు పూర్తి భిన్నంగా ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకొని చట్టసభల్లో విమర్శలకు దిగడం మనం చూస్తున్నాం. రాజకీయ పార్టీలకు సంబంధించిన వారి వ్యవహారంపై ప్రజలు చర్చించుకునేలా నేడు కొన్ని సంఘటనలు జరుగుతున్నాయి. ప్రశ్నించే హోదా ప్రతిపక్షానికి ఇచ్చి క్యాబినెట్ హెూదాను కల్పించింది రాజ్యాంగం. అయితే నేడు ఆ హోదాను అనుభవిస్తూ వ్యక్తిగతంగా దూషణలకు దిగడమే పరిపాటిగా మారిపోయింది. ఈ పరిస్థితులు మారాల్సి ఉంది.

ప్రజాశక్తి: మీ వ్యక్తిత్వ విధానాలు వలన ఇబ్బందులు పడ్డారా?

అధికారి: నేను అట్టడుగు వర్గాలను చైతన్యం చేస్తూ వారిని ఉన్నత హోదాలకు తేవడానికి సహజంగా ఇష్టపడతాను. అలానే 2003లో నల్గొండ జిల్లాలో స్వయం సహాయక గ్రూపులలో అక్కడి దాదాపు ఐదు వేల మంది పేదవారిని సమీకరించి గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలుగా ఏర్పాటు చేసి, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, ఆర్థిక పెంపుదలకు అవసరమైన అవగాహన తరగతులను నిర్వహించాను. దీంతో నా పిడి బాధ్యత నుండి నన్ను పక్కకు తప్పుకోమన్నారు. ఫ్యూడలిస్టులు ఉన్న ఆ ప్రాంతంలో ఇలాంటి సమానత్వపు ఆలోచనలను జీర్ణించుకోలేని కొందరు అప్పటి గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి నుండి ఫోన్ చేపించి నా బాధ్యతలను నుండి నన్ను తప్పించి విఆర్ కు పంపారు. రెండు వారాల వ్యవధిలో దాదాపు 5 వేల మంది స్థానిక ప్రజలు నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఒక సామాజిక విప్లవం మొదలైంది. ఈ పరిస్థితులను గమనించిన అప్పటి ప్రభుత్వం వెంటనే తనకు పోస్టింగ్ ఇచ్చింది.

ప్రజాశక్తి: వారసత్వపు రాజకీయాలు ప్రజలకు మేలు చేస్తాయా?

అధికారి: రాజకీయాల్లో సహజంగా వివిధ కోణాల్లో ఆలోచించే వ్యక్తులు అక్కడక్కడ ఉంటారు. అందరికీ సముచిత స్థానం కల్పించబడాలంటే నేడు చాలా వ్యయప్రయాసలతో కూడుకున్నదే. కుటుంబ రాజకీయాలు వల్ల మేధావులుగా, ప్రజా సమస్యలపై గళం విప్పిన నాయకులు ఎవరైనా పూర్తిస్థాయిలో రాజకీయ జీవితంలో రాణించలేరు. వారసత్వపు రాజకీయాల్లో కీలకమైన వ్యక్తి కొడుకును, కుమార్తెను పొగుడుతూ ఉండేవారికి తగిన ప్రాధాన్యత లభిస్తుందనడానికి గడిచిన కాలాన్ని మనం చూడవచ్చు. వారసత్వపు రాజకీయాల వలన ప్రజలకు ఎప్పటికీ న్యాయం జరగదు. స్వతహాగా తన నిర్ణయాన్ని బహిరంగంగా చెప్పలేని వారు ఇమడలేక నలిగిపోతుండడం నేడు రాజకీయ పార్టీల్లో మనం గమనించవచ్చు.

ప్రజాశక్తి: ఒక ఐఏఎస్ అధికారిగా సంతృప్తిగా ప్రజలకు న్యాయం చేసిన సంఘటన ఏదైనా ఉందా?

అధికారి: ప్రభుత్వ విధానాలకులోబడి నెల్లూరు జిల్లాలో డిఆర్డిఏ విడిగా 30 వేల మంది ప్రజలకు 17వేల ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఆస్తుల కల్పన చేశాను. 2004లో



నెల్లూరు పరిసర ప్రాంతాలలో ఉన్న లక్ష 61 వేలమంది దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించి ప్రతినెల ఐదు రకాల నిత్యావసర వస్తువులను వారికి ఉచితంగా ఇప్పించాను. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మూడు లక్షలకు పరిమితమైన రుణ పరిమితిని 45 లక్షలకు చేర్చి ఎంతోమంది ఉపయోగించుకునేలా చేశాను. ఇవి నాకు చాలా సంతృప్తిని కలిగించింది.

ప్రజాశక్తి: చట్టసభల్లో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు లేవనెత్తే ప్రక్రియ ఇప్పుడు కొనసాగుతోందా?

అధికారి: చట్టసభలో ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గతంలో ప్రజా సమస్యలను లేవనెత్తి అధికార పార్టీ వివరణను పొందేవారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తిగా రూపు మారిపోయిందనే చెప్పాలి. నేడు చట్టసభల్లో వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పక్కన పెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటువంటి సంఘటనల వల్ల ప్రజాప్రతినిధులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నామన్న సంగతి గుర్తు ఉంచుకోవాలి.

ప్రజాశక్తి: విశ్రాంత అధికారి నుండి రాజకీయాల వైపు నడిపించిన పరిస్థితులు ఏవి?

అధికారి: ఒక అధికారిగా ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తూ వారికున్న సమస్యలను తొలగించడంపై ఒక అవగాహన కలిగి ఉన్నాను. నా ఆలోచనలన్ని అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసమే. అందుకే ఒక ఆశయం నిర్ణయించుకునే రాజకీయాల్లోకి వచ్చానే తప్ప వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకోవడానికి ఏమాత్రం కాదు. ఒక నిర్ణయాత్మకమైన ఆలోచనతో ప్రజాప్రతినిధిగా ఉండి పేద ప్రజలకు సాయం చేయాలని ఆలోచన నాది. గత నెల రోజులుగా లిబరేషన్ కాంగ్రెస్ తిరుపతి పార్లమెంటు అభ్యర్థిగా ప్రజలలో తిరుగుతున్నాను. నేను వెళ్లిన చోట ప్రజల అన్నది ఒకటే మాట. ఓటు కోసం మేము డబ్బులు అడగలేదు..డబ్బులు వారిచ్చి పనులు చేయలేదని, మేము అడిగితే డబ్బు తీసుకొని ఓటు వేశావు కదా అంటున్నారని చెబుతున్నారు. ప్రజల్లో నా పర్యటనపట్ల అనూహ్య స్పందన వచ్చింది. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి నేను ప్రయత్నిస్తున్నాను.

ప్రజాశక్తి: నేడు రాజకీయాల్లో కుల మతాల మధ్య చిచ్చులతో ఎవరికి నష్టం?

అధికారి: ప్రభుత్వాల ప్రధాన ధ్యేయం శాంతి భద్రతలు, రక్షణ కల్పించడం, మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం. కానీ ఇవేమీ నేడు పట్టనట్టుగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ఏమి చేస్తే ఓట్లు పడతాయని ఆలోచనలో రాజకీయ పార్టీలు సతమతమవుతూ ఎత్తులకుపై ఎత్తులు వేసుకుంటున్నారు. అన్ని వర్గాల్లోనూ పేద ప్రజలు ఉన్నారు. దాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకొని వారి అభివృద్ధికి ప్రణాళికలు చేయడం ప్రారంభం అవ్వాలి. అప్పుడే సమాంతర అభివృద్ధి దేశంలో జరుగుతుంది? తిరుగుబాటు ప్రజల నుండి వస్తే ఇటువంటి పరిణామాలు తుడిచిపెట్టుకుపోతాయి.

ప్రజాశక్తి: సచివాలయ వ్యవస్థ పటిష్టమైందేనా?

అధికారి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో ఒక స్థానం ఉండాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను రూపొందించాం. సచివాలయ వ్యవస్థ పటిష్టమైందే. సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు కూడా రావడానికి తగిన నిబంధనలను తయారు చేసి అసెంబ్లీలో ఆమోదం చేయించాం.

టీడీపీని గెలిపించుకోవడం బీసీల బాధ్యత

- ఇంటింటి ప్రచారం డాక్టర్ కలికిరి మురళిమోహన్

ప్రజాశక్తి-ఐరాల:
టీడీపీని గెలిపించుకోవడం బీసీల బాధ్యతని టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ అన్నారు. మంగళవారం పొలకల పంచాయతీలో ఎన్నికల ప్రజాగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్రహారపల్లెలో ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీసీలను ఉద్దేశించి ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు బీసీలకు రక్షణ కరువైందని, జగన్ ప్రభుత్వంలో బీసీలకు కనీస గౌరవం లేదని, బీసీలకు ఆత్మగౌరవంను పెంచిన పార్టీ టీడీపీ ఒక్కటే అని చెప్పారు. నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించి రాజకీయాల్లో బీసీలకు ఉన్నత స్థానం కల్పించారని చెప్పారు. బీసీ లందరూ ఐక్యమత్యంగా టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయడం, పూతలపట్టులో అభ్యర్థిని గెలిపించుకోవడం బీసీల భాధ్యత అని మురళిమోహన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు తనయుడు దగ్గుమళ్ల సుధాకర్, నాయకులు గిరిధర్ బాబు, గురజాల సందీప్, మురళి, లతా, బాబునాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో టిడిపి అభ్యర్థి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మండలంలోని ఎర్రచేను గ్రామ సమీపంలో వెలసిన కొమ్మేపల్లి అమ్మవారి ఆలయానికి చిత్తూరు అసెంబ్లీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ విచ్చేసి పూజలు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయానికి విచ్చేసిన గురజాల జగన్మోహన్‌కు ఆలయ ధర్మకర్త పద్మనాభ రెడ్డి, గ్రామ పెద్ద జగన్నాథ రెడ్డిలు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం గురజాల అమ్మవారికి కర్పూర హారతి సమర్పించి, మొక్కుకున్నారు. అనంతరం అక్కడకు విచ్చేసిన భక్తులకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతనోత్సాహంతో కొత్త తెలుగు సంవత్సరంలో కర్షకులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సి.అర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, కార్యాలయ సమన్వయ కార్యదర్శి మోహన్ రాజ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, చిత్తూరు రూరల్ మండల అధ్యక్షుడు శశికర్ బాబు, ప్రధాన కార్యదర్శి రఘు, తోపాతిపల్లి సర్పంచ్ మునిరత్నం, మాజీ ఎంపిటిసిలు కాశీ, చంద్రశేఖర్, నేతలు కాటమరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి పెద్దపీట: కృపాలక్ష్మి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

ప్రజాశక్తి-కార్వేటినగరం: వైసీపీ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీపీ లతబాలాజీ దంపతులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ముస్లిం సోదరులను పట్టించుకో లేదని, రాష్ట్ర వైసీపీ అధికారం చేపట్టాక ముస్లింల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలబడితే మరింత అభివృద్ధి చేయడానికి జగనన్న సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్రాజు, దాసరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుమతి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్, కోఆప్షన్మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, మహిళా నాయకులు మోహనకుమారి, గిరిజ, అంభిక పలువురు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వైసీపీ జీడి నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కలత్తూరు కృపాలక్ష్మిని పలువురు నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీకి చెందిన బోడిరెడ్డి నరేష్‌రెడ్డి, కె.రవికుమార్ రెడ్డి, రోశయ్య మేస్త్రి, చిట్టి తదితరులు ఉన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు నమ్మొద్దు.!

ప్రజాశక్తి-రామకుప్పం: టీడీపీ ఎన్డీయేతో జతకట్టడంపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ముస్లింలు నమ్మరాదని మాజీ ఎమ్మెల్యే, మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్, టీడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషాలు కోరారు. మంగళవారం వారు రామకుప్పంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు చంద్రబాబు ఎప్పుడు అండగా ఉంటారని వారు తెలిపారు. ఎన్ని చట్టాలు చేసిన, ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చంద్రబాబు చూసుకుంటారని అన్నారు. గతంలో ఎన్డీఏలో ఉన్నప్పటికీ టిడిపి ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ తోఫా, షాదిముబారక్, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం యువతకు విరివిగా సబ్సిడీ రుణాలు, మహిళలకు కుట్టు మిషన్ల, ఇమామ్, మౌజమ్‌లకు జీతాలు ఇచ్చిందన్నారు. సమావేశంలో పిఎస్ మునిరత్నం, గోపినాథ్, ఆనంద్ రెడ్డి, అంజనేయరెడ్డి, సీతాపతి, జితేందర్, జాకీర్, సర్ధార్, ఆన్సర్, రఫీ, సీన, సలాంసాబ్, అక్బర్ తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆటో స్టాండ్‌ను తలపిస్తున్న ఆర్‌టిసి బస్టాండ్

- బస్టాండ్ ఆవరణంలో వెలసిన దుకాణాలు
- బస్సులు వెళ్లాలంటే అన్నీ అడ్డంకులే
- పట్టని అధికారులు

బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఆటోలు, ప్రయివేట్ వాహనాలు

ప్రజాశక్తి-కలకడ
మండల కేంద్రమైన కలకడ బస్టాండ్ ఆవరణం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు పేర్కొన్నారు. కలకడ బసాండ్‌కు పీలేరు, రాయచోటి, కడప, జమ్మలమడుగు, పులి వెందుల, బద్వేల్, చిత్తూరు తిరుపతి, మదనపల్లి, తదితర డిపోలకు చెందిన బస్సులు వస్తూ పోతూ ఉంటాయి. బస్టాండ్ ఆవరణంలో ఆటోలు, దుకాణాలు ఏర్పాటు చేయడంతో బ స్సులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయా ణికులు ఇబ్బందులకు గురతున్నారని తెలిపారు. బస్సుల కోసం బస్టాం డ్ ఆవరణంలో నిలుచుకోడానికి కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణీకులు ఆవేదన చెందు తున్నారు. ఆటోలు ఒకవైపు, మరోవైపు పూలు, పండ్ల దుకా ణాలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబు తున్నా రు. బ స్టాండ్ ఆవరణం రద్దీగా ఉండ టంతో ఒక బస్సు బ స్టాండ్‌లోకి వెళితే, మరో బస్సు వెళ్లాలంటే బస్టాండ్ బయట ఉన్న చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై నిలుచు కోవ లసిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇంత జరుగు తు న్నా బస్టాండ్ పరిధిలో ఉన్న దుకాణములకు అద్దె తీసుకుం టు న్నారు కానీ సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రమేనని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టిసి యాజ మాన్యం ఇక్కడ కంట్రోలర్‌ను ఏర్పాటు చేయలేదని, ఒకవేళ కంట్రోలర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ కొద్దిరోజులు ఉంచి తర్వాత తొలగించడం జరుగుతుందని చెప్పారు. దుకాణాలు, ఆటోలు, ప్రయివేట్ వాహనాలు బస్టాండ్ ఆవరణములకు వస్తూ పోతూ ఉండటం వల్ల రద్దీ ఏర్పడి తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయా ణీకులకు ఇబ్బం దులు లేకుండా ఆటోలు, దుకాణాలను ఖాళీ చేయించాలని స్థానిక ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

బిసిల సంక్షేమం టిడిపితోనే సాధ్యం :'మండిపల్లి'

ప్రజాశక్తి-చిన్నమండెం బిసిల సంక్షేమం టిడిపితోనే సాధ్యమని రాయ చోటి అసెంబ్లీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిన్నమండెం కస్పాలో షేక్ అలీబాషా ఇంటిదగ్గర బిసి ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి హాజరైన రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి, జనసేన, ఎన్డిఎ కూటమితోనే బిసిల అభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు. టిడిపి బిసిల ప్రభుత్వమని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు మరింత మెరుగు పరిచేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. బిసిల రిజర్వేషన్ శాతాన్నిని తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలకు అడ్డంపడ్డ ప్రభుత్వం వైసిపి అని గుర్తుచేశారు. గతంలో కూడా టిడిపి బిసిలను వారి రాజకీయ ఎదుగుదలకు ప్రత్యేక భూమిక పోషిం చిందని అన్నారు. మండలంలో వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న బిసి కుటుంబాలు ఎక్కువగా నివసి స్తున్నాయని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఇక్కడి వారందరికీ సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు.చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే వ్యక్తిని కాదని ఆయన ఎద్దేవా చేసారు. టిడిపి అధికారం లోకి రాగానే మండల బిసిలకు సింహభాగాన్ని కేటాయిస్తామని పేర్కొన్నారు. నాలుగు పర్యా యాలు గెలిచిన స్థానిక వైసిపి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మండలంలోని బిసిలకు ఏమిచేశారో చెప్పాలన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రత్యేక బిసి రక్షణ చట్టం అమలులోకి తీసుకవచ్చి వైసిపి బానిస సంకెళ్లు నుండి బిసిలకు విముక్తి కలిగిస్తామని చెప్పారు.ఎవరితోనూ వ్యక్తిగత తనకు ఎటువంటి విభేదాలు లేవని అనునిత్యం కార్యకర్తలకు, అభిమానులకు అండగా వున్నానని పేర్కొన్నారు. అవినీతి లేని పాలన కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. తనకు ఒక్కసారి అవకాశం అందిస్తే అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. మండలాభివృద్ధి కోసం ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. టిడిపితోనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. టిడిపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం చిన్నమండెం మాజీ ఎంపిటిసి షేక్ అలీభాషా 200 మైనార్టీ కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు. వీరందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల బిసి, మైనార్టీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చిన్నమండెం ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా విని యోగించుకోవాలని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళ ీవారం మండలంలోని కొత్తపల్లి పంచాయతీలోని శ్రీరా మ్ నగర్‌కాలనీ, శ్రీనివాసపురం, కలిబండ గ్రా మాల్లో కేంద్ర బల గాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛా యుత వాతావరణంలో వినియో గించుకునే అవ గాహన కల్పించేందుకు కవాతు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ స ంఘటనలు జరగకుండా నిఘాను పటిష్టపరచినట్లు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- డాక్టర్ హసీనా వెల్లడి

ప్రజాశక్తి-బి.కొత్తకోట:
గర్భిణులు పోషకాహారం బాగా తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డలకు సురక్షితమని డాక్టర్ హసీనా తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో చాలా మంది గర్భవతులు గర్భం దాల్చినప్పుడు నిర్ధారణకు వచ్చినప్పుడు మేము జాగ్రత్తలు చెప్పి రక్త పరీక్షలు చేసి,రక్తం వృద్ధి చెందాలంటే పోషక ఆహారం తీసుకొని ఐరన్ టాబ్లెట్లు వాడాలని సూచించడం జరుగుతుందన్నారు. ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించి నప్పటికీ మండలంలో చాలామంది గర్భం దాల్చి నిర్ధారణ చేసుకొని ప్రతి నెల పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల వారి బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేకపోవడం,తల్లికి రక్తం తక్కువ ఉండడం వంటి సమస్యలు తలెత్తు తాయన్నారు. కాన్పు సమయంలో వచ్చిన వారు ఎప్పుడో గర్భం దాల్చినప్పుడు వస్తారు కానీ మళ్ళీ పరీక్షలకు రాకపోవడం డెలివరీ టైంలో సమస్యలను గుర్తించడం జరుగు తుందన్నారు.

సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్
ఉగాది పండుగను పురస్క రించుకొని పట్టణంలోని యాచకులకు మంగళవారం మా ఊరి సినిమా హీరో పులివెందుల మహేష్, శ్రావణ్ మాస్టర్ గొడుగులు, చెప్పులు, అన్నం ప్యాకెట్లు, వాటర్ బాటిల్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం, శివాలయం, తదితర ప్రాంతాల్లో ఉన్న యాచకులకు గొడుగు, అన్నం ప్యాకెట్లు తదితర వస్తువులను అందజేశారు. ం వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ప్రజా ట్రస్టుకు ప్రజలు చేసిన సహాయార్థం, తన కొంత సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా ట్రస్టుకు ప్రజలు చేసిన సాయంతో అన్ని వస్తువులు కొనుగోలు చేసి పంపిణీ చేశామన్నారు. అభాగ్యులను సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకంగా ఉందన్నారు. ఈనెల 11న రంజాన్ పండుగను పురస్కరించుకొని మిగిలిన వారికి కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, షఫీ (రొట్టెగాడు) పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి: ఎస్ఐ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో స్థానిక ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో మంగళవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల అధికారి గుర్తించిన సమస్యాత్మక గ్రామాలు అనుపల్లి పంచాయతీలోని బొప్పరాజు పల్లి, నూతుగుంటపల్లి, అనుపల్లి, గోకులాపురం గ్రామాలలో కవాతు నిర్వహించారు. మే 13వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చునని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. మండలంలో సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరగాలని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల రోజు ఎన్నికలకు ఆటంకం కలిగించే వ్యక్తులను (ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్ లను) ముందుగా గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామని ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాలలో నాటు సారా తయారీ, విక్రయాలు, అక్రమంగా మద్యం విక్రయిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒక వ్యక్తి 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకుని బయటి ప్రాంతాలకు వెళ్లకూడదని ప్రజలకు తెలిపారు. అధిక మొత్తంలో నగదును తీసుకెళ్తే తనిఖీలలో పట్టుబడితే నగదు సీజ్ చేస్తారని తెలిపారు. గ్రామాలలో జూదం, కోడిపందేలు, ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులు వంటి కార్యకలాపాలకు యువత పాల్పడకూడదని సూచించారు. ఈ పోలీస్ కవాతులో రమణ, శ్రీకాంత్, ధన, త్యాగ, యోబు, రమేష్ రెడ్డి పాల్గొన్నారు

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

పేద ముస్లింలకు రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న దాతలు

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు గ్రీన్ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జలీల్ అహ్మద్, కమిటీ సభ్యులు చేతుల మీదగా రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని ఎస్ కే బి చికెన్ షాప్ వద్ద 700 రూపాయలు విలువ చేసే గృహ నిత్యావసరాలను 500 మంది ముస్లిం కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలు నుండి గ్రీన్ ఫౌండేషన్ ద్వారా మరెన్నో కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. అందులో భాగంగానే ముందస్తు రంజాన్ సందర్భంగా రంజాన్ తోఫా ను అందించామన్నారు. తమకు ఉన్నంతలో నిరుపేదల కోసం తగిన సహాయ సహకారాలు అందించడమే తమ లక్ష్యం అన్నారు. కరోనా సమయంలో కూడా ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు మరెన్నో సేవలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు, గ్రీన్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు షంషుద్దీన్, కోకర్ల మధు యాదవ్, దారా సురేష్, బాబు, మస్తాన్ బాష పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న దాతలు

వాలీ బాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఆలత్తూరు పంచాయతీ చెందిన యువతకు తిరుపతి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌పాల్, సాయి నాయుడు యువతకు మంగళవారం వాలీబాల్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత విద్యా రంగంలోనే కాకుండా క్రీడారంగలో కూడా ముందంజలో ఉండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీలలో మన మండలంలోని యువత జిల్లా, రాష్ట్ర స్థాయికి చేరుకున్నారని అలాంటి యువతకు తమ సహాయక కిట్లు అందిస్తున్నామని తెలిపారు. యువత అనేక క్రీడలలో పాల్గొని జాతీయ స్థాయిలో ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన కుమార్, వైసిపి యూత్ లీడర్లు వెంకటేష్, ఎం హేమంత్ , స్థానికులు చంద్రారెడ్డి, చెంచమ్మ, మోహన్ భాస్కర్, ఉదయ్ మోహన్ పాల్గొని ప్రసాద్ పాల్‌కు, సాయి నాయుడుకు యువకులు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న ఈద్గా కమిటీ ఛైర్మన్ ఖాదర్ బాషా

రంజాన్ వేడుకలలో పాల్గొనండి: ఖాదర్ బాషా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఈద్గా మైదానంలో ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహిస్తున్నామని ఈద్గా కమిటీ ఛైర్మన్ ఖాదర్ బాషా తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తిరుపతి నగరపాలక సంస్థ ఈద్గా మైదానంలో ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చొరవతో ఈద్గా మైదానంలో రంజాన్ వేడుకల నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తున్నా రన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు ఈద్గా మైదానంకు వచ్చి శుభాకాంక్షలు మాత్రమే తెలపాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, మాలిక్, షేక్ అహ్మద్, అబ్దుల్ కపూర్, కాసిం చోటా బాష, చాంద్ బాష పాల్గొన్నారు.

టిడిపికి, వైసీపీకి ఓటు వేసినా బిజెపికి వేసినట్లే..

లిబరేషన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విజయ్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిడిపికి, వైసిపికి ఓటు వేసినా బిజెపికి వేసినట్లేనని మాజీ ఐఎఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విజయ్ కుమార్ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపికి, వైసిపికి ఓటు వేసినా బిజెపికి ఓటు వేసినట్లే అవుతుందన్నారు. ప్రస్తుతం ఏపీలో రెండు కుటుంబాలు నాలుగు పార్టీలుగా వ్యవహరిస్తూ సీఎం కుర్చీ కోసం పోటీ పడుతున్నాయని, ప్రత్యేక హోదా వాగ్దానానికి పదేళ్లు నిండిపోయాయని, పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పినవారు, 25 ఎంపీలు ఇస్తే మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న వారు అధికారంలోకొచ్చి ఆ మాట మరిచారన్నారు. నేడు వారు ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపితో బహిరంగంగా ఒకరు, రహస్యంగా ఒకరు సంబంధాలు నడుపుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని పేర్కొన్నారు. ఆంధ్రను పాలించే అర్హత టిడిపికి, వైసీపీకి లేదని, కేసులో ఇరుక్కుని రాజధాని అమరావతిని పోగొట్టిన వారొకరు, అధికారాన్ని పొంది రాజధానిని లేకుండా చేసిన వారు మరొకరన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపడానికి రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలని ఈ ఏడాది ఫిబ్రవరి 14న లిబరేషన్ కాంగ్రెస్‌ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. యునైటెడ్ ఫ్రంట్ లో భాగంగా 9 రాజకీయ పార్టీలతో కలిసి ఈ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని పలు స్థానాల నుండి పోటీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వర్గాలకు ఉద్యోగాలు రానివ్వకుండా గత రాజకీయ పార్టీలు పెత్తందారీ పోకడలను అవలంబించాయన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో లిబరేషన్ కాంగ్రెస్ రాష్ట్రంలో ఆరు పార్లమెంటు నియోజక వర్గాలు, 24 అసెంబ్లీ, 6 పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తుందన్నారు. పరిపాలన దక్షత లేని వారు, గంజాయి, మద్యాన్ని నియంత్రించలేని వారిని ప్రజలు బహిష్కరించాలన్నారు. మద్యం అమ్మకాలపై డిజిటలైజేషన్ తీసుకు రావాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విన్నవించామన్నారు. ఈ సమావేశంలో వీసీకే రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లిబరేషన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విజయ్‌కుమార్

వైభవంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లి పంచాయతీ రేకలు చేను గ్రామం వద్ద శ్రీ జన్మస్థల శివాలయంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్త భజనలు మధ్య స్వామికి ఉగాది పచ్చడి, పండ్ల ప్రసాదాలతో ధూప దీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జ్యోతిష్యులు రమేష్ బాబు ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించి రాశి ఫలాలు గురించి వివరించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచాయతీలో దేవాలయాలకు పూజా సామగ్రి, ఉగాది పచ్చడి, ప్రసాదాలు అందించారు. ఉగాది పచ్చడి పంపిణీ చేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గురునాథరెడ్డి, సభ్యులు హరినాథ్ రెడ్డి, కే ఈశ్వర్ రెడ్డి, బండ్ల సోమేశ్వర్, బి దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కె కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: పాకాల మండలంలోని ఊట్లవారిపల్లి సమీపాన ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఉగాది సందర్భంగా అభిషేకాలు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించామని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఛైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ మహాసముద్రం పట్టాభి రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ప్రజలకు ముందు శ్రీ క్రోధి నామ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ యువరాణి, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, ఆలయ సిబ్బంది భాస్కర్, మణి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో

పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ప్రజలతో మమేకంలో భాగంగా స్థానిక శివాలయంలో ఉగాదిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు శ్రీ క్రోధి నామ నూతన సంవత్సర తెలుగు ఉగాది శుభాకాంక్షలు తెలిపి భక్తులకు ఉగాది పచ్చడి అందించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రమణ్యం మాట్లాడుతూ మనకు షడ్రుచుల సమ్మేళనం చేదు, తీపి, కారం, ఉప్పు, వగరు, పులుపు అనే ఆరు రుచులు ఉగాది పచ్చడి రూపంలో నూతన సంవత్సరంలో ఒక కఠిన సత్యాన్ని, సందేశాన్ని మనకు అందిస్తుందన్నారు. మానవ జీవితం తీపి జ్ఞాపకాలకే కాదు.. కఠోరమైన చేదు అనుభవాలకు కూడా ఆలవాలమన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ ప్రధాన కార్యదర్శి విజయ్, సహాధ్యక్షులు శివకుమార్, నాయకులు రాజేంద్ర, తులసిరామ్, లోకనాథం, ప్రసాద్, కోటకొండ బాబు, విశ్రాంత ఉద్యోగులు అరుణాచల రెడ్డి, రామమూర్తి రాజు, ఆలయ కమిటీ సభ్యులు మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కోట : కోట పట్టణంలో పలు చోట్ల పలు సీసీ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఇప్పటికే కొన్ని వీధుల్లో సిసి రోడ్డులు నిర్మించారని, ప్రజల రాకపోకలకు రహదారులు సక్రమంగా ఉండాలనే ఉద్దేశంతో సీసీ రోడ్లును నిర్మిస్తున్నామని నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి తెలిపారు.

రాత్రి వేళల్లో జోరుగా దొంగతనాలు

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: తిరుపతి జిల్లా నారాయణవరం మండలం లోని సముదాయం, నారాయణవనం చుట్టుపక్కల గ్రామాలలో రాత్రి వేళల్లో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు పగలు వేళలో గ్రామంలో తిరుగుతూ రాత్రి వేళలో జోరుగా దొంగతనాలు పాల్పడుతున్నారని సముదాయం, నారాయణవనం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవు తున్నారు. పోలీసులు నామ మాత్రం గస్తీ చేపడుతున్నారు తప్ప రాత్రి వేళల్లో గ్రామాలలో పూర్తి స్థాయిలో పోలీసులు గస్తీ తిరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సముదాయం బైపాస్ వద్ద గత వారం ముందు మీనాక్షమ్మ ఇంట్లో దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి 2 గంటలకు సముదాయం గ్రామంలో పల్లె వీధిలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని గుర్తించిన స్థానికులు పట్టుకోవడానికి ప్రయత్నించగా దొంగ పరారయ్యాడు అని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి పగలు అని తేడా లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పోలీసులు వైఫల్యంతోనే రాత్రి వేళలో జోరుగా దొంగతనాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో పూర్తిస్థాయిలో గస్తీ నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పుత్తూరు డిఎస్పి, పుత్తూరు రూరల్ సీఐ, నారాయణవనం ఎస్సై దొంగతనాలపై స్పందించి రాత్రి వేళలో గస్తీని ముమ్మరం చేసి ప్రజలలోని భయాందోళనలను పోగొట్టాలని కోరుతున్నారు.

'బాలిక మృతికి కారకుడిని కఠినంగా శిక్షించాలి'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రెండు రోజులు క్రితం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం భీమిగాని పల్లి పంచాయతీ పరిధిలోని కమతంపల్లికి చెందిన కె ఆనంద్, లక్ష్మీ దేవిల కుమార్తె కే హేమావతి(17) పదవ తరగతి చదివిని బాలిక ఇటుకల బట్టీల తయారీ ప్రదేశంలో బహిర్భూమికి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన గణేష్ అత్యాచారానికి పాల్పడడంతో బాలిక అవమాన భారంతో చనిపోయిందని, బాలిక మృతికి కారకుడైన నిందితుడు గణేష్‌ను బాలల లైంగిక వేధింపు నిరోధక చట్టం(పోక్స్)2012 ప్రకారం కఠినంగా శిక్షించాలని పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కేంద్రం కన్వీనర్ పల్లం అమరనాథ్ డిమాండ్ చేశారు. జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కేంద్రం కోకన్వీనర్ ఎన్ దొరస్వామి, సభ్యులు కె రెడ్డెప్ప, టి మహేష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసంలో చేపడుతున్న ఉపవాస దీక్షలకు జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో బంగారుపాళ్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఏర్పాటు చేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, ఎంపీ అభ్యర్థి రెడ్డప్ప పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముస్లింలకు పవిత్ర మాసం రంజాన్ ఈ మాసంలో ఉపవాస దీక్షలను చేపట్టి వారిలో ఉన్న భక్తి భావాన్ని వెల్లపుచ్చుతారని వారికి సహచరులు విందు అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, అమరావతి, మోహన్‌రెడ్డి, సర్దార్, ఫిరోజ్ అహ్మద్, కామరాజు, ముబారక్, దిలీప్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని నంజంపేటలో ముస్లింలకు తిరుపతి శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ అధినేత డాక్టర్ సూర్య సేన్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. రూ.25వేల ఖర్చుతో 300మందికి ఇఫ్తార్ విందును అందించారు. మంగళవారం నంజంపేట గ్రామానికి వచ్చి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఇవ్వడం కఠిన ఉపవాసం ఉంటూ ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో తమ భక్తిని చాటుకుంటారని అలాంటి మాసంలో వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దాతలు

గోవిందయ్యకు నివాళి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని మెదవాడ పంచాయతీ మర్రిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గోవిందయ్య అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చేరుకొని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మంగళవారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, సరిత, జనార్దన్, మణి, మాజీ జెడ్పీటీసీ శిరీషా గురవారెడ్డి, నాయకులు కుప్పయ్య, ఉమాపతి, బాబు, ఆనందయ్య పాల్గొన్నారు.

'గ్రామాల్లో పందులు పెంచొద్దు'

గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-వికోట: మండలంలోని కొంగాటం పంచాయతీ కొండేపల్లిలో పందులు పెంపకం చేపడుతున్నారని స్థానికులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. వాటి మూలంగా పశువులు, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ బాబులు ఆ గ్రామానికి చేరుకున్నారు. అక్కడి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకొని వెంటనే పందులను తరలించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో పందులు పెంచొద్దని పెంపకదారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామం నుంచి వ్యానులో తరలిస్తున్న పందులు

శ్మశానానికి దారి కల్పించండి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గొనితిమ్మేపల్లి పంచాయతీలోని ఎస్సీల శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కోరారు. ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. శ్మశాన స్థలంలో అనేక ఇబ్బందులున్న విషయాన్ని మండల అధికారులు సైతం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్య తీర్చాలన్నారు. అలా కాని పక్షంలో ఆందోళన చేపడతామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ స్వర్ణలతను వివరణ కోరగా సమస్య ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదన్నారు. శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేసి పరిష్కరిస్తామని తెలిపారు.

అట్టహాసంగా విజ్ఞాన మందిరం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-తవణంపల్లి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విజ్ఞాన మందిరాన్ని తవణం పల్లి మండలం ఈచనేరిలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. చిత్తూరు జిల్లా స్వేరో సర్కిల్ ప్రధాన కార్యదర్శి యువరాజు స్వేరో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఏపీ స్వేరోస్ మాజీ గౌరవ సలహాదారులు మహేష్ స్వేరో పాల్గొన్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించిన స్వేరోస్ సంస్థ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులను జ్ఞానవంతులుగా, ఆదర్శవంతులుగా వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అన్ని రంగాల్లోనూ ఎదిగేలా ప్రోత్సాహం కల్పించే ప్రయత్నం ఎల్లప్పుడు చేస్తూనే ఉందని, యువతీ యువకులు ఎదుగుదల కోసం కృషి చేస్తూ ఉంటుందన్నారు. స్వేరోస్ ఆధ్వర్యంలో కొన్ని వందల మంది విదేశాల్లో అంతర్జాతీయ, జాతీయ ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత చదువులు చదువుతున్నారని, మరి కొందరు అన్ని శాఖల్లోనూ అగ్ర స్థానాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అదే స్ఫూర్తితో మునుపెన్నడూ లేనివిధంగా ఈచనేరి గ్రామంలో యంగ్ లీడర్ యువరాజ్ స్వేరో ఆధ్వర్యంలో దాదాపు రెండు సంవత్సరాల పాటు కష్టపడి, ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొని, అద్భుతమైన విజ్ఞాన మందిరాన్ని కట్టడం చారిత్రక ఘట్టమని కొనియాడారు. ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని దీనికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ విజ్ఞాన మందిరం ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని, చరిత్రలో నిలిచిపోయేలాగా ఎంతో మంది విద్యార్థులను ప్రోత్సహించి వారు వివిధ రంగాల్లో స్థిరపడ్డానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కృష్ణమూర్తి, మనోహర్, మహేష్ కిషోర్, కళ్యాణ్, శరత్, పార్థసారధి, వెంకటేష్, అక్షిత్, నవీన్, లోకేష్, సురేష్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేష్ స్వేరో

చెత్తపై రాజకీయాలు తగదు: వైసీపీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రమాదవశాత్తు కాలిపోయిన డంపింగ్ యార్డ్‌పై టీడీపీ రాజకీయాలు చేయడం తగదని వైసీపీ కార్పొరేటర్, నగర అధ్యక్షులు జ్ఞాన జగదీష్, మాజీ మహిళా అధ్యక్షురాలు గాయత్రి దేవి అన్నారు. మంగళవారం చిత్తూరు వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చిత్తూరు నగరంలోని స్థానిక సంతపేటలో ఉన్న డంపింగ్ యార్డ్ సోమవారం ప్రమాదవశాత్తు కాలిందన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, స్థానిక ప్రజలు స్పందించడంతో పెద్ద ప్రమాదం నుండి మంటలను అదుపు చేయడం జరిగిందన్నారు. సహాయక చర్యల్లో భాగంగా స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు. వెంటనే చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి స్పందించి వారికి కావలసిన ఏర్పాట్లు చేసి సహాయ సహకారాలు అందించడంతో పెనుముప్పు తప్పిందన్నారు. అదేవిధంగా ఫైర్ ఇంజనులతో, ట్యాంకర్లతో శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మీడియా సమావేశంలో నాయకులు గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంటు ప్రారంభం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: గ్రామీణ ప్రజలకు శుద్ధి నీరు అందించడం హర్షించదగ్గ విషయమని పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం బంగారుపాళ్యం మండలంలోని కుమ్మరపల్లి గ్రామంలో కరణం రుక్మిణమ్మ భర్త చెంగల్రాయ పిళ్లై కోడలు గీతాంజలి జ్ఞాపకార్థం నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి నీరు అందించాలనే ఉద్దేశంతో గ్రామంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దాదాపు రూ. 5లక్షల వరకు వెచ్చించి గ్రామంలో శుద్ధి నీరు అందించేందుకు ఏర్పాటు చేయడం, పరిసర గ్రామ ప్రజలకు నీరును అందివ్వడం వారి దాతృత్వానికి నిదర్శనం అన్నారు. అనంతరం శుద్ధి నీటి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కరణం సుధాకర్ పిల్లై, దొరస్వామి రెడ్డి, జయకుమార్, రాజారెడ్డి, గురునాథంరెడ్డి, జగదీష్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాభిరామ స్వామి వారి ఆలయంలో పంచాంగ శ్రవణం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని శ్రీ యోగాభిరామ స్వామి వారి ఆలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయంలోని మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం రామరత్న శాస్త్రి పంచాంగ శ్రవణం చేయగా గ్రామస్తులు శ్రద్ధగా ఆలకించారు. ఈ ఏడాది రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, వర్షాలు రైతుల పరిస్థితి వృత్తి వ్యాపారం ఆదాయం వ్యయం తదితర అంశాల గురించి గ్రామస్తులు పంచాంగ శ్రవణ కర్తను అడుగుతూ ఉండగా ఆయన వివరంగా పంచాంగం చూసి వారి ప్రశ్నలకు సమాధానాలను అందజేశారు. మండలంలో ఏడాది వర్షాలు ఆశించినంత మేర ఉంటాయని రైతులకు తగిన ఆదాయం ఉంటాదని తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ కవి మోహన్, పద్దు స్వామి, మాజీ సర్పంచి శ్రీరాములు, మిలటరీ రెడ్డప్ప, ఎర్ర మసయ్య గారి శంకర, పూల మురళి, కామి శెట్టి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం చేస్తున్న రామరత్న శాస్త్రి

ఆదమరిస్తే.. అంతే..!

- పట్టణ నడిబొడ్డులో ప్రమాదకరంగా కాలువ
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులూ తస్మాత్ జాగ్రత్త

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణ నడిబొడ్డులో మురుగునీటి కాలువ ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారికి ఆనుకొని ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులంటున్నారు. వాహనదారులు, చిరువ్యాపారులు ఆదమరిస్తే కాలువలో పడే ప్రమాదం ఉందంటున్నారు. ప్రమాదకరంగా ఉన్న కాలువ సమస్య అధికారుల దృష్టిలో ఉన్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్పందించి కాలువ వద్ద గోడ నిర్మించాలని అప్పటి వరకూ హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులో అదుపులోకొచ్చిన మంటలు..

- రాత్రంతా శ్రమించిన మున్సిపల్, అగ్నిమాపక యంత్రాంగం
- దగ్గరుండి పర్యవేక్షించిన కమిషనర్ డాక్టర్ జె.అరుణ
- పరిసర ప్రాంతాల ప్రజలకు మాస్కులు పంపిణీ
- ముందస్తు జాగ్రత్తగా 20కుటుంబాల సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక డంపింగ్ యార్డులో మంటలు అదుపులోకి వచ్చాయి. నగరపాలక, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది రాత్రంతా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం ఉదయం వరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా లెనిన్ నగర్‌లోని 20కుటుంబాలను అంగన్వాడీ కేంద్రానికి తరలించారు. పొగ వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంటింటికి వెళ్లి మాస్కులు పంపిణీ చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. నగరపాలక ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి రాత్రంతా విధులు నిర్వహించారు. మూడు అగ్నిమాపక యంత్రాలు, నగర పాలక చెందిన ట్యాంకర్ల ద్వారా సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో మంగళవారం వేకువజామున మంటలు అదుపులోకి వచ్చాయి. డంపింగ్ యార్డులోని చెత్తను జేసీబీల సాయంతో వేరు చేసే ప్రక్రియ కొనసాగింది. ఇదే సమయంలో మంటలు మరోసారి రాకుండా మిగిలిన వ్యర్థాలను పోర్టబుల్ పంప్ యంత్రాలతో నీటితో తడుపుతున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. మంగళవారం ఉదయం డంపింగ్ యార్డు, పరిసరాలను పరిశీలించారు. చేపట్టాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు.

మంటలు అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న కమిషనర్ (ఫైల్)

అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ రావాలి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్త సమావేశం నిర్వహించి మాట్లాడారు. గడిచిన పదేళ్లుగా కేంద్రం, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. బీజేపీ పూర్తిగా వ్యవస్థలను దుర్వినియోగం చేసిందని దుయ్యబట్టారు. నియంత, నిరంకుశత్వంకి భారతదేశంలో అర్థం చెప్పిన వాడు నరేంద్ర మోడీనేనన్నారు. పేదలకు కాకుండా ధనవంతులకు రూ.16లక్షల కోట్ల రుణమాఫీ అంటే అది ఖచ్చితంగా భారతదేశంలో అతి పెద్ద కుంభకోణం అవుతుందన్నారు. కేంద్రంలో బిజెపి వ్యతిరేక విధానాలు స్వస్తి చెప్పాలన్నా, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పరిపాలన పోవాలన్నా కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తుందని తెలిపారు. అందువల్ల ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాబోయే ఎలక్షన్లో ఒక సైనికుడిలా కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ ఆర్.బాబు, పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, నాయకులు ఢిల్లీ, దేశయ్య, చిరంజీవి రెడ్డి, అల్లాబక్ష్, కుమార్, నాగేశ్వరావు, సుబ్రహ్మణ్యరెడ్డి, శివ, సభాపతి రెడ్డి, భీమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలతో రాకేష్‌రెడ్డి

ఇండియా కూటమితోనే మార్పు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమాజంలో మార్పు ఇండియా కూటమితోనే సాధ్యపడుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పోతుగుంట రాజేష్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆయన రేణిగుంటలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావణ్‌ను కలిసి ఎన్నికలపై సమాలోచించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపుకు సహకరించాలని కోరారు.

టాటా చక్ర టీగోల్డ్ ఫైనల్‌లో రష్మిక మందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దక్షిణ భారతదేశంలో రెండవ అతిపెద్ద టీ బ్రాండ్, టాటా టీ చక్ర గోల్డ్, ప్రతి సిప్‌లోనూ దాని మహోన్నత రుచిని వేడుకగా జరుపు కుంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో గత 90 రోజులుగా ఎంతో ఆసక్తిగా నిర్వహిస్తున్న సువర్ణ అవకాశం పోటీని బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందన్న సమక్షంలో ముగించింది. ఈ సందర్భంగా ఆ సమస్త సౌత్ ఏసియా టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ అధ్యక్షులు పునీత్ దాస్ మాట్లాడుతూ అత్యంత కీలకంగా టాటా టీ చక్ర గోల్డ్ స్ఫూర్తి ఉంది, ఇది రష్మిక మందన్నతో మీట్ అండ్ గ్రీట్ సెషన్‌ను సాధ్యం చేయడంలో కీలకంగా పనిచేసిందన్నారు. టాటా టీ చక్ర గోల్డ్ బ్రాండ్ అంబాసిడర్ రష్మిక మందన్న ఈ భాగస్వామ్యం గురించి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ "నేను పెద్ద టీ ఫ్యాన్‌ని.. టాటా టీ చక్ర గోల్డ్‌ని ఆస్వాదించే వరకు నా రోజు ప్రారంభం కాలేదనే భావిస్తాను. నా అభిమానులతో కలిసి ఓ కప్పు టి పంచుకోవడం కంటే సంతోషకర మైంది ఏముంటుంది?" అన్నారు. అనంతరం 500 మంది విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు వినియోగదా రులు విజేతలు పాల్గొన్నారు.

తిరుపతి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ చింతామోహన్

పూతలపట్టు అసెంబ్లీ నుంచి పోటీ చేయనున్న ఎంఎస్ బాబు

చింతామోహన్

ఎంఎస్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో

ఏఐసీసీ అధిష్టానం రాష్ట్రంలో పోటీ చేయనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల తుది జాబితాను ఏఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ప్రకటించారు. తిరుపతి జిల్లా తిరుపతి పార్లమెంటు స్థానం నుంచి మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ పోటీలో దిగనున్నారు. అలాగే చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం నుంచి వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు ఇటీవలనే ఏపీ పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పూతలపట్టు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎం.ఎస్ బాబు బరిలో దిగనున్నారు.

మసీదుల ముస్తాబు

ప్రజాశక్తి-సోమల: రంజాన్ పండుగను పురస్కరించుకొని అన్ని చోట్లా మసీదులు, ఈద్గాలు ముస్తాబవుతున్నాయి. అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు చేపడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తిశ్రద్ధలతో రంజాన్ దినాన్ని జరుపుకొంటారు. ఈనెల 11వ తేదీన రంజాన్ పండుగ జరగనుండగా ప్రార్థనా మందిరాలను ప్రత్యేక అలంకరణగా తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగా సోమల ఇరికిపెంట, నంజంపేట, నవాబుపేట, పెద్దఉప్పరపల్లి, కందూరు ప్రాంతాల్లో మసీదులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. విద్యుత్ అలంకరణతో మసీదులు ఆకర్షవంతంగా కనిపిస్తున్నాయి.

తిరుచ్చివాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారు మంగళవారం ఉగాది ఉత్సవాల్లో భాగంగా స్వామివారు తిరుచ్చివాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 9.30 నుంచి 10.30 గంటల నడుమ స్వామివారి ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేదం మంత్రాల నడుమ కనుల పండువగా స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం 4గంటలకు వేదపడింతులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 7:30గంటల మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీ వేణుగోపాలస్వామి వారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, తిరుచివాహనంపై ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు. తీర్చుకున్నారు. తిరువీధి ఉత్సవర్ష అనంతరం ఆలయానికి వేంచేసిన స్వామివారికి రాత్రి 8.90 ఏకాంత సేవ నిర్వహించి స్వామివారిని పవళింప జేశారు. ఈ కార్యక్రమంలో టీటీటీ ఆలయ అధికారి సురేష్కుమార్, అర్చకులు నారాయణ దాశరథి... టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.


తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న స్వామివారు